ప్రజాశక్తి
గురువారం 22 మే, 2025
5
శ్రీకాకుళం

48,988 దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతికవిశ్వ విద్యాలయంలో మంగళవారంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ముగిసిందని డైరెక్టర్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 48,988 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఆరేళ్ల సమీకత ఇంజినీరింగ్ చదువు చదివే అవకాశం ఉందన్నారు. రెసిడెన్సియల్ విధానంలో విద్య, మంచి ఉన్నతమైన ఉద్యోగాలు సాధన, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం, గ్రామీణ ప్రాంతాల యువత ఎక్కువ మందికి ప్రవేశాలు లభిస్తున్నాయి. ట్రిపుల్ ఐటిలో ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఈయనతో పాటు పరిపాలనా అధికారిముని రామకృష్ణ, డీన్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసరు వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ గేదెల రవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

- రేషన్ వాహనాల నిలిపివేతతో రోడ్డున పడ్డ వందలాది కుటుంబాలు
- ప్రస్తావన లేని బకాయిలు సొమ్ముల చెల్లింపులు
- వాహనాల ఇన్సూరెన్స్‌పై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఆందోళనలకు సిద్ధమవుతున్న ఆపరేటర్లు

అగమ్యగోచరం

మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్ (ఎండియు) వ్యవస్థ కొనసాగింపుపై చాలాకాలంగా చర్చలకు ప్రభుత్వం ముగింపు పలికింది. జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వందలాది ఆపరేటర్ల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం ఇచ్చిన చాలీచాలనీ జీతంతో ఎదో విధంగా నెట్టుకొస్తున్న ఆపరేటర్లరకు ఉన్న ఉపాధి కూడా పోవడంతో ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. తమను ఉన్నపళంగా పొమ్మంటే ఎలా బతికేదంటూ వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మరోవైపు అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకానికి బియ్యం అందిస్తున్నందుకు వారికి బకాయిపడ్డ సొమ్ములు విషయం తేల్చకుండానే వారిని తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంపై వారు మండిపడుతున్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రేషన్ సరుకులను అందిస్తున్న ఆపరేటర్లు (ఫైల్)

రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేసేందుకు గత ప్రభుత్వం 2020లో మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్ (ఎండియు) వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చింది. సరుకుల పంపిణీకి ఆపరేటర్లను నియమించింది. వారికి రూ. లక్షల విలువ చేసే వాహనాలను సమకూర్చింది. అర్బన్ ప్రాంతాల్లో సరుకుల పంపిణీకి ఫిబ్రవరి ఒకటో తేదీన, గ్రామీణ ప్రాంతాల్లో నిత్యవసర వస్తువులను అందించేందుకు ఫిబ్రవరి 15వ తేదీన వాహనాలను సమకూర్చింది. జిల్లాలో 422 మంది ఆపరేట్లను నియమించారు. డోర్ డెలివరీ చేసే ఆపరేటర్‌కు తొలుత ప్రభుత్వం రూ.16 వేలు వేతనంగా నిర్ణయించింది.

వాహనాలకు డ్రైవర్లుగా మాత్రమే పనిచేయాల్సి ఉంటుందని చెప్పిన ప్రభుత్వం తర్వాత వారితో తూకం, ఈ-పాస్ మిషన్‌లో వివరాలు నమోదు తదితర పనులు అప్పగించింది. దీంతో తమకు ఇస్తున్న వేతనం చాలదని నాలుగు రోజులు పని చేసి ఆపేశారు. దీంతో అప్పటి ప్రభుత్వం వారితో చర్చలు జరిపి రూ.16 వేలు నుంచి రూ.21 వేలు వేతనంగా చెల్లిస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న వేతనం చాలకపోయినా కష్టమో నష్టమో భరిస్తూ ఇప్పటి వరకు పనిచేస్తున్నారు.

కొద్ది కాలంగా వేధింపులు

ఎండియు వ్యవస్థ ఏర్పాటైన నాటి నుంచి ఒక రోజులో ఒక ఆపరేటర్ 90 నుంచి 120 కార్డుల వరకు డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి పంపిణీ మొదలు సాయంత్రం ఏడు గంటల వరకు సరుకులను ఇచ్చేవారు. ఒకటో తేదీ నుంచి 17వ తేదీ వరకు నిత్యవసర వస్తువులను అందించేవారు. సర్వర్ల సమస్యలు, వర్షాలు వంటి కారణాలతో లబ్ధిదారులు ఆ సరుకులను అందుకోలేని పరిస్థితి ఉంటే... ఒకటి లేదా రెండు రోజులు పాటు పొడిగించేవారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పదో తేదీ నాటికే సరుకుల పంపిణీ పూర్తి చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. రోజూ 200 నుంచి 250 మంది కార్డుదారులకు కచ్చితంగా సరఫరా చేయాలంటూ నిబంధన విధించింది. దీంతో సరుకుల పంపిణీకి గడువు కుదింపు, సమయ వేళలు పెంచడంతో వారిపై పని భారం రెట్టింపయ్యింది.

ప్రత్యామ్నాయం చూపని ప్రభుత్వం

రేషన్ వాహనాల ద్వారా సరుకుల పంపిణీని నిలిపివేతతో ఆపరేటర్లు ఉపాధి కోల్పోయారు. గతంలో వీరంతా స్కూల్ బస్సులు, ప్రైవేట్ వాహనాలకు డ్రైవర్లుగా పనిచేసేవారు. కొంత మంది రాజకీయ నాయకుల వాహనాలకు డ్రైవర్లుగా ఉండేవారు. నెలకు రూ.16 వేతనం, 90 శాతం సబ్సిడీతో వాహనాలను సమకూర్చడంతో అందరూ ఈ పని వైపు ఆకర్షితులయ్యారు. ఉన్నపళంగా వీరిని తొలగించడంతో ఇప్పటికిప్పుడు ఏం పనులు దొరకుతాయని వారు ప్రశ్నిస్తున్నారు. కుటుంబాలతో ఎలా బతికేదని వారు ఆవేదన చెందుతున్నారు.

ఆపరేటర్లను తొలగించడం సరికాదు

అగ్రిమెంట్ ప్రకారం రెండేళ్ల పాటు విధుల్లో కొనసాగే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఉన్న పళంగా రేషన్ ఆపరేటర్లను తొలగించడం సరికాదు. కరోనా మహమ్మారి వంటి కష్టకాలంలోనూ ఆపరేటర్లు ప్రాణాలకు తెగించి సరుకులు అందించారు. తమ ఖాతాల నుంచి మినహాయించిన రూ.9,500 ఇన్సూరెన్స్ సొమ్ము, అంగన్‌వాడీ, మధ్యాహ్న బోజన పథకం కోసం అందిస్తున్న బియ్యానికి ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలు తేల్చలేదు. బ్యాంకులకు చెల్లించాల్సిన రూ.1.90 లక్షలను వాయిదాల రూపంలో ప్రభుత్వమే చెల్లించాలి. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించుకుంటే ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తాం.

- రౌతు సూర్యనారయణ, ఎండియు ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు

కుటుంబాలతో ఎలా బతికేది?

నాలుగేళ్లుగా దీనిపైనే బతుకుతున్నాం. కష్టమైనా, నష్టమైనా వచ్చిన ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. ఇప్పుడు ఉన్నపళంగా తీసేస్తే ఎలా బతుకుతాం. ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నయ ఉపాధి చూపించాలి

- పైడి వరహానరసింహులు, రేషన్ వాహన ఆపరేటర్

మావోయిస్టుల అగ్రనేత కేశవరావు మృతి

కేశవరావు మృతదేహం

కేశవరావు (ఫైల్)

కేశవరావు ఇల్లు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో చోటు చేసుకున్న భారీ ఎన్‌కౌంటర్‌లో 28 మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. వీరిలో మండలం జీయన్నపేటకు చెందిన మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు (67) మృతి చెందారు. బసవరాజు ఉన్నారన్న సమాచారంతోనే మాఢ్ ప్రాంతాన్ని భద్రతా బలగాలు చుట్టిముట్టి మావోయిస్టులు, భద్రతా బలగాలకు ఎదురుకాల్పుల్లో కేశవరావు మృతి చెందారు. కేశవరావు 1955లో స్వగ్రామం జీయన్నపేటలో నంబాళ వాసుదేవరావు, వరలక్ష్మిలకు జన్మించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు స్వగ్రామంలోని ప్రాథమిక పాఠశాల, ఆరు నుంచి పదో తరగతి వరకు నౌపడలోని జిల్లా పరిషత్ పాఠశాల, ఇంటర్‌మీడియట్ టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్నాడు. తరువాత టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ చదువుతూ అనంతరం వరంగల్లులోని ఆర్ఇసి ఇంజనేరింగ్ కళాశాలలో బి.టెక్ చేశారు. ఎంటెక్ చదువుతూ 1984లో పిపుల్‌వార్ సిద్ధాంతాలకు ప్రభావితులయ్యారు. పెళ్లి చేసుకోకుండా ఆజన్మ బ్రహ్మచారిగా ఉన్న కేశవరావు కుటుంబీకులెవరూ ప్రస్తుతం ఆ గ్రామంలో లేరు. తల్లిదండ్రులు మృతి చెందారు. సోదరుడు ఢిల్లేశ్వరరావు ఉద్యోగ రిత్యా వేరే ప్రాంతాల్లో ఉన్నారు. నక్సలిజంలోకి వెళ్లిన తర్వాత కేశవరావు స్వగ్రామానికి ఒక్కసారీ రాలేదంటున్నారు. ఆయన మృతి తెలియగానే గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఇక పేదలకు ఇక్కట్లే

మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- పాతపట్నం

కూటమి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పంపిణీ పథకాన్ని రద్దు చేయడం ద్వారా నిరుపేదల నోటికాడ కూడు లాగేసిందని వైసిపి రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతపట్నం తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఉన్న సమయంలో ప్రారంభించిన ఇంటింటికీ నాణ్యమైన బియ్యం పంపిణీ పథకం పేదలకు ఆహార భద్రత కల్పించడంలో ఒక మంచి ముందడుగని అన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులు తమ ఇంటి వద్దకే నాణ్యమైన బియ్యాన్ని పొందడం, మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించడం వంటి ప్రయోజనాలు పొందారని గుర్తు చేశారు. రేషన్ దుకాణాల వద్ద జరిగే అక్రమాలను, అవినీతిని అరికట్టేసి, మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి, లబ్ధిదారులకు నేరుగా సరుకులు అందేలా చూశారని అన్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను అందించడం, వృద్ధులు, వికలాంగులు మరియు ఇతరులు రేషన్ దుకాణాలకు వెళ్లే శ్రమను తగ్గించి, ఇంటి వద్దకే సరుకులు అందించడం ద్వారా వారికి సౌలభ్యం కల్పించడం, ప్రతినెలా సకాలంలో రేషన్ సరుకులు లబ్ధిదారులకు చేరేలా చూడటం వంటి మంచి పనులను చేశారని వివరించారు. ప్రజలకు నేరుగా లబ్ధిచేకూర్చే పథకాలను రద్దు చేసేటప్పుడు ప్రభుత్వాలు పారదర్శకతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

జీడికి గిట్టుబాటు ధర హామీ అమలు చేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

మాట్లాడుతున్న మోహనరావు

పలాస : జీడి పిక్కలు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు ధర కల్పించి ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు, ఎపి జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం జీడి రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. జీడికి గిట్టుబాటు ధర, జీడి కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. ఎన్నికల్లో వాగ్దానం చేసి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. అన్ని పంటలకు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు ఇటీవల ప్రకటన చేశారని, అందులో జీడి పంటపై ఎటువంటి అభివృద్ధి చర్యలు చేపడతారో లేకపోవడం విడ్డురంగా ఉందని అన్నారు. విదేశీ పిక్కలు దిగుమతి వల్ల స్థానిక పిక్కలు కొనుగోలు విషయంలో దళారులు, వ్యాపారులు రైతులను దగా చేస్తున్నారని, అందుకే స్థానిక పిక్కలు కొనుగోలు చేసిన తరువాతనే విదేశీ పిక్కలు దిగుమతికి అనుమతివ్వాలని కోరారు. జీడి పంటని వాణిజ్య పంటగా చేర్చాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధరపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీడి పంటను కేంద్ర మద్దతు ధరల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా జీడి రైతంగం ఆందోళనలు చేస్తున్నా గత ప్రభుత్వం గాని, ప్రస్తుత ప్రభుత్వం గానీ జీడి రైతుల సమస్యలు పట్టించుకోకపోవడం చోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం జీడికి గిట్టుబాటు ధర, జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పిన హామీని తుంగలో తొక్కేశారని విమర్శించారు. ఇప్పటికైనా జీడికి గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి కోరారు. ఈ నెల చివరి వారం నుంచి దశలవారి పోరాటానికి జీడి రైతంగాన్ని సన్నద్ధం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో జీడి రైతు సంఘం నాయకులు బత్తిని లక్ష్మీనారాయణ, టి.రాజు, డి.తారకేశ్వరరావు, జె.సంతోష్, టి.తాతారావు, సిఐటియు నాయకులు ఎన్.గణపతి పాల్గొన్నారు.

21 వరకు యోగాంధ్రా అభ్యాసన

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

యోగ చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

గ్రామస్థాయి నుంచి పెద్ద ఎత్తున యోగాలో పాల్గొనేందుకు వీలుగా బుధవారం నుంచి నెలరోజుల పాటు యోగాంధ్రా పేరిట అభ్యాసన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపు నిచ్చారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో యోగాభ్యాసన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. జూన్ 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని విశాఖ వేదికగా హాజరు కానున్న ఈ కార్యక్రమానికి ముందస్తు వేడుకలు చేపట్టాలన్నారు. జిల్లాలోని యోగాంధ్రా కార్యక్రమాలు గ్రామస్థాయి నుంచి చేపట్టాలన్నారు. అందులో గ్రామీణ ప్రాంత ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. వీరికి యోగా టీచర్ శిక్షణ ఇస్తారన్నారు. యోగాంధ్రా వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. యోగాపై వక్తృత్వ, వ్యాసరచన, తదితర పోటీలు ఉంటాయన్నారు. పర్యాటక ప్రాంతాలు, బీచ్‌లో యోగా కార్యక్రమం ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వంరావు, ఆర్‌డిఒ కె.సాయిప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అనిత, యోగా టీచర్లు పాండ్రంకి మురళీకృష్ణ, తంగి స్వాతి, ఎ.గాయత్రి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం మాటామంతిపై జెసి సమీక్ష

సమీక్షిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్థానిక భవానీ థియేటర్‌లో గురువారం మాటామంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. మండలంలోని రావిలవలసలో స్థానిక నాయకులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం చేపట్టనున్న మాటా మంతి కార్యక్రమానికి రావివలస ఎంపికైందన్నారు. గ్రామ పరిస్థితులు, ప్రధాన సమస్యలు తదితర అంశాలపై గ్రామస్తులతో, ప్రజాప్రతినిధుల తో మాట్లాడుతారని అన్నారు. పది మంది స్థానిక సమస్యలపై మాట్లాడాలని సూచించారు. ప్రతిఒక్కరూ రెండు సమస్యలపై మాట్లాడితే సరిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో క్రైం ఎస్‌పి పి.శ్రీనివాసరావు, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, డిపిఒ కె.భారతిసౌజన్య, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి, టిడిపి నాయకులు ఎల్.ఎల్.నాయుడు, బడే జగదీష్, ఇప్పిలి జగదీష్, జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ పాల్గొన్నారు.

టీచర్లలో బదిలీల సందడి

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు ఎట్టకేలకు బదిలీల కోసం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంపై బదిలీల సందడి నెలకుంది. ఇందుకు సంబంధించిన నోటిపికేషన్ బుధవారం విడుదల కావడంతో ఉపాధ్యాయులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. బుధవారం నుంచే దరఖాస్తులు పెట్టుకునేందుకు కూడా సిఎస్ఇలో వెబ్‌సైట్ కూడా ప్రారంభించారు. గత మూడేళ్లుగా బదిలీలు లేకపోవడంతో చాలా మంది ఉపాధ్యాయులు ఎక్కడ వారు అక్కడే ఉండిపోయారు. ఎన్నికల కోడ్ అమలు పేరుతో కొంతకాలం, ప్రభుత్వం మారుతుందన్న నెపంతో గత ప్రభుత్వం బదిలీల ఊసు పెట్టుకోలేదు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు నోటిపికేషన్ జారీ కావడంతో ఉపాధ్యాయుల్లో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే వేసవి సెలవు రోజుల్లోనే నోటిపికేషన్ జారీ కావడంతో బదిలీల కోసం సిద్ధమయ్యాయి. అందరూ వెబ్ ఆప్షన్‌తో బదిలీల ప్రక్రియ చేపడుతుండడంతో ఉపాధ్యాయులు ఇంటిపట్టునే దరకాస్తులు చేసుకోనున్నారు. ఆయితే కూటమి ప్రభుత్వం విద్యా సంస్కరణల్లో భాగంగా పాఠశాలలను 9 రకాల పాఠశాలలుగా విభజించడంతో గందరగోళం నెలకుంది. దీంతో బదిలీ కోసం దరఖాస్తు చేసుకుంటే ఏ రకం పాఠశాలకు తాము చెందుతామో అనే సందేహలపై ఇంకా ఉపాధ్యాయుల్లో సందేహాలు నెలకుండడంతో వారిలో అయోమయ పరిస్థితులు నెలకున్నాయి. ఒకే పాఠశాలలో 8 సంవత్సరాలు విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో తమకు దగ్గర్లో ఉన్న పాఠశాలలు ఏమిటో ఆనే దానికోసం వెతుకాలట ప్రారంభించారు. బదిలీల్లో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటిలకు వేర్వేరుగా బదిలీలు నిర్వహించనున్నారు. పాఠశాలలు తెరిచినాటికే బదిలీల ప్రక్రియ పూర్తిచేయనున్నారు. కొత్త విద్యా సంవత్సరంలో కొత్త ఉపాధ్యాయులతో పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఎట్టకేలకు బదిలీల కోసం నోటిఫికేషన్ జారీ కావడంతో ఉపాధ్యాయుల్లో సందడి వాతావరణం చోటుచేసుకుంది.

పకడ్బందీగా పెట్రోలింగ్ గస్తీ

ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి

మాట్లాడుతున్న ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జాతీయ రహదారి మార్గంలో ప్రత్యేక కార్యాచరణతో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి సూచించారు. హైవే రోడ్డు మార్గంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాలు, నేరాలు నివారణ, సహాయక చర్యలు, రహదారి భద్రత, అత్యవసర సమయంలో స్పందించడం, హైవే పెట్రోలింగ్ సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులు తదితర అంశాలపై బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షించారు. హైవే పెట్రోలింగ్ వాహనాలు తిరిగే ప్రదేశాలు, సిబ్బంది, వారి విధి విధానాలు తదితర అంశాలపై ఆరా తీశారు. రహదారిపై నేరాలను, ప్రమాదాలను నివారించడం, ప్రయాణికులకు సహాయం అందించడం హైవే పెట్రోలింగ్ సిబ్బంది ముఖ్యమైన విధి అని అన్నారు. ఆ దిశగా అప్రమత్తంగా ప్రతిఒక్కరూ విధులు నిర్వర్తించాలన్నారు. వాహనాల నిర్వహణ (మెంటెన్షన్) సక్రమంగా ఉండాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా లారీలు, ఇతర భారీ వాహనాలు పార్కింగ్ లేకుండా చూడాలన్నారు. కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసేలా చూడాలన్నారు. సర్వీస్ రోడ్డు మార్గంలో వాహనాలు వ్యతిరేక దిశలో వచ్చే వాహనాలు నియంత్రించాలని తెలిపారు. హైవే మార్గంలో దాభా, హోటళ్లు నిర్ణీత సమయానికి మూసివేయించాలన్నారు. వేకువజామున సమయంలో టోల్ ప్లాజ్, చెక్ పోస్టులు వద్ద వాహన చోదకులకు నిరంతరం ఫెష్ వాష్ కార్యక్రమం చేపట్టాలన్నారు. ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా ప్రమాద హెచ్చరిక, మలుపు, అతివేగం, నియంత్రణ సూచిక బోర్డులు, స్టాఫర్స్ సోలార్ బ్లింకర్స్ నిర్వహణ సక్రమంగా ఉండేలా హైవే అథారిటీ సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది రేడియం జాకెట్లు తప్పక ధరించాలని ఆదేశించారు. రోడ్లపై ట్రాఫిక్ క్రమబద్ధంగా నిర్వహించడం, ట్రాఫిక్ జామ్లను నివారించడం వంటివి హైవే పెట్రోలింగ్ సిబ్బంది బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించే సమయంలో వెంటనే ప్రమాద ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు, క్షతగాత్రులను దగ్గరలో ఆస్పత్రులకు 108 అంబులెన్స్ సహకారంతో తీసుకువెళ్లాలని తెలిపారు. రోడ్డుపై ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే, హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే స్పందించి సహాయం అందించాలన్నారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిని గుర్తించి రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించాలన్నారు. సమీక్షలో అదనపు ఎస్‌పి కె.వి.రమణ, డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద్, ఎం.వి.అప్పారావు, సిఐలు పైడిపునాయడు, అవతారం, శ్రీనివాస్, విజయ కుమార్, తిరుపతిరావు, శ్రీనివాసరావు, జె.శ్రీనివాస్, ఆర్ఐ కె.నర్సింగరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటరమణ

నేడు జిల్లా మినీ మహానాడు

శ్రీకాకుళం: నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో టిడిపి మినీ మహానాడు ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ తెలిపారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మినీ మహానాడు కార్యక్రమానికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నానాయుడు పాల్గొంటున్న పేర్కొన్నారు. జిల్లాలోని కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఎఎంసి చైర్మన్, డైరెక్టర్లు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు సింతు సుధాకర్, మాదారపు వెంకటేష్, మెండ దాసునాయుడు, చిట్టి మోహన్, కలగ జగదీష్, శీర రమణ, బొణిగి భాస్కరరావు, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, పిఎంజె బాబు పాల్గొన్నారు. నంతరం ఎంపీ కార్యాలయంలో కేంద్రమంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఎండియు ఆపరేటర్లను తొలగించడం తగదు

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎండియు ఆపరేటర్లు

శ్రీకాకుళం: నిరంతరం ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్న ఎండియు ఆపరేటర్లను తొలగించడం తగదని ఎండియు ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రౌతు సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోం, కలెక్టరేట్ వద్ద బుధవారం ఎండియు ఆపరేటర్ల నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 9,260 ఎండియు ఆపరేటర్లు, 9,200 సహాయకులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరు విధుల్లో చేరిన సమయంలో 72 నెలల అగ్రిమెంట్ ఉందని, ప్రస్తుతం మరో రెండేళ్ల పాటు విధుల్లో కొనసాగే అవకాశం ఉన్నా... ప్రభుత్వం రాత్రిరాత్రికి అనాలోచిత నిర్ణయంతో ఆపరేటర్లను తొలగించడం సమంజసం కాదని తెలిపారు. ఇటువంటి నిర్ణయాల వల్ల సుమారు 18,500 కుటుంబాలు రోడ్డున పడతామయని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కష్టకాలంలో కూడా ఒక్కో ఆపరేటర్ 1500 వందల నుంచి 2000 ఇళ్లకు వెళ్లి తమ ప్రాణాలను పణంగా పెట్టి నిత్యవసర సరుకులను అందజేశారని చెప్పారు. తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించే దిశగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎండియూ ప్రతినిధులు హేమసుందర్, వరహానరసింహులు, వెంకటూరావు, దివాకర్, కిషోర్, వరుణ్, కిరణ్, అప్పలనాయుడు, రవి, వాసు, గోపి, గోవిందరాజు, అనిల్, గణేష్, శంకర్, రామారావు, కిట్టు, శ్రీను, మాధవ్, భాస్కర్ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

టెక్కలి : టెక్కలి మండల రెవెన్యూ అధికారుల తీరుపై తేలినీలాపురానికి చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని సుమారు వంద మందికి చెందిన రైతుల పట్టాదారు పాసుపుస్తకాల్లో భూములు నమోదు ప్రక్రియలో రెవెన్యూ అధికారులు చేసిన తప్పుడు నిర్ణయాలపై ఆవేదన వ్యక్తం చేస్తు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తికి బుధవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన తమ భుములు తమకు కాకుండా వేరే వారికి నమోదు చేశారని అన్నారు. కొంతమంది భూములను 22ఎ కింద చూపి ప్రభుత్వానికి చెందినవిగా నమోదు చేయడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సర్వేలో భూ వ్యత్యాసాలు ఉండడంపై అసహనాన్ని వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ తప్పిదాలపై గతంలో ఫిర్యాదు చేశామని, అయితే రెవెన్యూ అధికారులు స్పందించలేదని అన్నారు. ఇప్పుడు అడిగితే చలానాలు తీయమని, ముటేషన్ చేయమని చెబుతూ నిబంధనలు చెబుతున్నారని అన్నారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాలకు తాము ఎందుకు చలానాలు తీయాలని ప్రశ్నించారు. దీనిపై ఆర్‌డిఒ స్పందిస్తూ... ఎక్కువ శాతం మంది రైతులకు ఉన్న సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా సర్వే నిర్వహించనున్నామని హామీనిచ్చారు. రైతులు ఎటువంటి చలానాలు తీయవద్దని సూచించారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

27న అమరవీరుల సభ

ప్రజాశక్తి- పలాస

శ్రీకాకుళ ఉద్యమంలో అమరులైన పంచాది కృష్ణమూర్తి, శృంగవరపు నరసింహులు, బైనపల్లి పాపారావు, దున్న గోపాలరావు, నిరంజన్ సాహు తదితరుల వర్ధంతి వేడుకలు ఈ నెల 27 నిర్వహిస్తున్నామని, ఈ సభను విజయవంతం చేయాలని వక్తలు కోరారు. మండలంలోని బొడ్డపాడులో బుధవారం అమరుల దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాటి పాలకులు పట్టుకొని వారిని ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారని గుర్తు చేశారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు ఎన్‌కౌంటర్ల పరంపరం, బూటకపు ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్మారక కమిటీ కన్వీనర్ జోగి కోదండరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, లిబరేషన్ నాయకులు దుశ్మంత్, మద్దిల రామారావు, పిడిఎం రాష్ట్ర నాయకులు సాలిని వీరాస్వామి, పికెఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దిల ధర్మారావు, పుచ్చ దుర్యోధన, ఎఐకెఎంఎస్ నాయకులు గోరకల బాలకృష్ణ పాల్గొన్నారు.

యోగాతోనే మానసిక ప్రశాంతత

లావేరు: సహజ యోగా ధ్యానంతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని సహజ యోగా ట్రస్ట్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ రామకృష్ణ పేర్కొన్నారు. మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని పట్నావానిపేట, రేగపాలెం, లక్ష్మీపురంలో మాతాజీ నిర్మలా దేవి చైతన్య రథంతో పర్యటించి సహజ యోగాధ్యాన ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతిఒక్కరూ తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని, ఈ ఒత్తిడి నుంచి తట్టుకోవాలంటే ధ్యానం చేయడం ఒక్కటే మార్గమన్నారు. ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరడంతో పాటు మనం చేసే పనులపై ఏకాగ్రత పెరిగి ఆత్మవిశ్వాసం కలుగుతుందని వివరించారు. ప్రతిఒక్కరూ రోజులో కొంత సమయాన్ని ధ్యానం చేసేందుకు కేటాయించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాగితాల గోవింద్ రెడ్డి, బి.శ్రీను, నర్సింహులు, పి.భాస్కరరావు, లింగాల శ్రీనువాసరావు, కాంతారావు, రమణమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దర్శించుకుంటున్న విజయ, దాసు

ఘనంగా అమ్మవారి సంబరాలు

సోంపేట: మండలంలోని కొర్లం పంచాయతీ పరిధిలోని హుకుంపేట, రాజీవ్‌నగర్, వల్లాయిపేట కాలనీ తదితర గ్రామాల్లో గ్రామ దేవత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 19న ప్రారంభమైన ఉత్సవాలు 27 వరకు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. నీలమ్మ తల్లి, పెద్దమ్మతల్లి ఉత్సవాలను రోజుకొక వీధిలో ఊరేగింపు నిర్వహిస్తూ చేపడుతున్నారు. నేల వేషాలు సంస్కృతిక కార్యక్రమాలతో రోజూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సంబరాలను వీక్షించేందుకు గ్రామంలోని పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు వస్తున్నారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి నిమ్మన దాసు దర్శించుకున్నారు. ఎంపిపి నిధులతో నీటి ట్యాంకర్ ఏర్పాటు చేసి యాత్రికులకు తాగునీటిని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పైడి పట్టాభి, కర్రి జగదీష్, పెద్దింటి ఢిల్లీరావు, సివంగి సోమేష్, పూజారి తులసీరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి

నీటి సంఘాలతో కలిసి పనులు గుర్తించాలి

పలాస: వంశధార, ఇరిగేషన్ కాలువలు, చెరువులను అభివృద్ధి చేసేందుకు నీటి సంఘాలతో కలిసి పనులు గుర్తించాలని తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి, ఎంపిడిఒ వసంతకుమార్ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయశాఖ, ఇరిగేషన్, వంశధార అధికారులు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో వంశధార కాలువలు, ఇరిగేషన్ చెరువుల్లో పేరుకు పోయిన చెత్తా చెదారాలను తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టేందుకు నిధులు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. అందుకు సంబంధించిన పనులను త్వరితగతిన పరిశీలించి నివేదికను తమకు అందజేయాలన్నారు. ఇరిగేషన్, వంశధార కాలువల్లో ఏమైనా ఆక్రమణలు ఉంటే తమకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఎఇ పోలారావు, ఇరిగేషన్ ఎఇ శ్రీనివాసరావు, వంశధార ఎఇ రాజశేఖర్, ఉద్యానవన శాఖ అధికారి శంకర్ దాస్, ఎపిఒ శంకరరావు పాల్గొన్నారు.

పిడుగులు, ఉరుములపై అప్రమత్తం

పాతపట్నం: పిడుగులు, ఉరుములు వచ్చేటప్పుడు వీలైనంతవరకు సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు సూచించారు. మండలంలో పెదలోగిడిలో గొర్రెల పెంపకం దారులకు ఉరుములు, పిడుగులు వచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షం పడేటప్పుడు చెట్లు, టవర్ల కింద, హైవోల్టేజ్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండరాదని అన్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకుడు నిరంజన్, గొర్రెల పెంపకం దారులు బందపు ఆదినారాయణ, పిట్ట జగన్నాయకులు, బందపు తేజేశ్వరరావు, బేసింగి మార్కండేయ, ఇప్పిలి పాపయ్య, పిట్ట రాము పాల్గొన్నారు.

నలభై ఏళ్లు అధికారం టిడిపిదే

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో టిడిపి మరో 40 ఏళ్లు అధికారం దిశగా కార్యకర్తల అండతో ముందుకు సాగుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. బుధవారం పట్టణ శివారున ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కూన రవికుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో నాగావళి, వంశధార నదుల నుంచి ఏర్పాటు చేసిన వివిధ సాగునీటి కాలువల ద్వారా అందే సాగునీరు టిడిపి మంజూరు చేసిన పథకాలేనని అన్నారు. జిల్లా నుంచి ఎంతోమంది నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి కోసం వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని, వాటిని నివారించి ఎమ్మెల్యే రవికుమార్ ఆలోచనతో జిల్లాలో పరిశ్రమల స్థాపించడానికి కృషి చేస్తున్నామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేని కొంతమంది వైసిపి నాయకులు జిల్లా కేంద్రంలో గ్రీవెన్స్‌కి వెళ్లి నిరాధార ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. నియోజక వర్గంలోని ప్రతి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. తెలుగు జాతి ఉన్నంతవరకు టిడిపి బతికే ఉంటుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పదవులను అలంకరించిన వారిని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

వీర జవాన్‌కు నివాళి

మినీ మహానాడు ప్రారంభం ముందు ఎమ్మెల్యే రవికుమార్ పాకిస్తాన్, భారత్ సింధూర్ ఆపరేషన్ ప్రాముఖ్యత వివరిస్తూ సైనికులకు అభినందనలు తెలిపారు. అదే విధంగా సింధూర్ ఆపరేషన్‌లో ప్రాణాలు కోల్పోయి వీరమరణం పొందిన రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్‌కు నివాళ్లర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, నాలుగు మండలాల పట్టణ పార్టీ అధ్యక్షులు, టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

మాదక ద్రవ్యాల విక్రయంపై నిఘా

ప్రజాశక్తి- కవిటి

మాదకద్రవ్యాల విక్రయంపై ప్రత్యేక నిఘా వేశామని, మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రవివర్మ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని అన్ని షాపులను డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, దీనిపై ఎటువంటి సమాచారం ఉన్నా తమను సంప్రదించాలని సూచించారు. ఈ తనిఖీల్లో కవిటి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

రాజకీయం కోసం అభివృద్ధి ఆపొద్దు

ప్రజాశక్తి- నౌపడ

రాజకీయాల కోసం అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం సరికాదని సంతబొమ్మాళి మండల వైసిపి నాయకులు అన్నారు. ఈ మేరకు ఎంపిడిఒ జయంతి ప్రసాద్‌ను బుధవారం కలిసి వినతపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల, పంచాయతీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు పంచాయతీ తీర్మానాలు చేసినా మంత్రి ఆదేశాలతో అధికారులు చర్యలు చేపట్టడం లేదన్నారు. ప్రజా ప్రతినిధులైన తమ పనులు తాము చేసుకోకుండా అధికారంతో అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎం.అప్పారావు, నక్క భీమారావు, పి.రామకృష్ణ, బి.మోమన్ రెడ్డి, ఎం.నాగభూషణరావు, అంగ జనార్ధన్, బి.సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఫొటో గ్రాఫర్లు

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని కొండములగాంకు చెందిన ఫొటో గ్రాఫర్ కోంచ్రు త్రినాథరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇంటికి పెద్దదిక్కు త్రినాథరావు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని రణస్థలం, లావేరు మండల ఫోటోగ్రాఫర్స్ యూనియన్ తరపున రూ.70 వేలు ఆర్థికసాయాన్ని బుధవారం మృతుడు త్రినాథరావు తల్లిదండ్రులు అప్పారావు, తవుడమ్మలకు అందించారు.

ఉద్యోగ మేళాకు స్పందన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

సిఎం నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలని ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి మండలంలోని బంటుపల్లి పంచాయతీలో ఉన్న ఎన్ఇఆర్ స్కూల్ అఫ్ ఎక్సెన్స్ ఆవరణంలో మెగా జాబ్‌మేళా బుధవారం నిర్వహించారు. ఈ మెగా జాబ్‌మేళాకి 21 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 781 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా 302 మంది వివిధ కంపెనీల్లో ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ జాబ్‌మేళాకు హాజరైన ప్రతి నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ మాట్లాడుతూ ఏ రంగంలో ఉద్యోగ అవకాశం వచ్చినా దూరంతో సంబంధం లేకుండా అభ్యర్థులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి సుధ, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, ఎడి డిసెబుల్డ్ కవిత, ఎన్ఇఆర్ సంస్థల డైరెక్టర్ ఎన్.తేజ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

బహుమతులు అందజేస్తున్న దానేటి శ్రీధర్

తల్లిదండ్రుల కృషి పిల్లలకు వరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

తల్లిదండ్రుల కృషి ఫలితంగా పిల్లలు వృద్ధిలోకి రాగలుగుతారని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని పాలకొండ రోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన చిన్నారి ప్రపంచం బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నారులను అన్ని రంగాల్లోనూ తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. చిన్నతనం నుంచే ఎంచుకున్న రంగంలో రాణించేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదిగిన వారిలో తానూ ఉన్నానని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న నిరుపేద చిన్నారులకు ప్రతీఏటా జూన్ 1న రూ.10 వేలు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. టిడిపి నాయకులు గొండు స్వాతి శంకర్ మాట్లాడుతూ పిల్లలను వారి ఆసక్తి, అభిరుచికి అనుగుణంగా ఆయా రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని కొనియాడారన్నారు. కార్యక్రమంలో గంజి ఎజ్రా, ట్రాఫిక్ జాం శ్రీను రాయితీ చంద్రశేఖర్, విద్యాకమిటీ చైర్మన్ ఖండవిల్లి సిద్ధార్థ, మణిశర్మ, ఈశ్వరరావు, సాయిబాబా, నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రతిఒక్కరూ నేత్రాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలని సర్పంచ్ అట్టాడ గోపి అన్నారు. మండలంలోని పొల్లాడలో బుధవారం ఉద్దానం అభ్యుదయ సేవా సమితి శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నయనాలు ఆరోగ్యం కోసం ఆకుకూరలు, పాలు వంటి పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని కోరారు. వయసు పెరిగినకొద్దీ దృష్టి సమస్యలు మొదలవుతాయని అన్నారు. సెల్‌ఫోన్ల వినియోగం అధికం కావడం వల్ల చిన్నపిల్లల్లోనూ దృష్టి సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. శిబిరంలో 60 మందికి నేత్ర వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి 15 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అట్టాడ రఘు, ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు తమాడ లక్ష్మణరావు, కొమరల్తాడ సర్పంచ్ చింత రాజు, చింత మోహనరావు, పవన్ కుమార్, మండల మహేష్, కోళ్ల కృష్ణారావు, మాగుబరి చందు, చొక్కల శంకర్ పాల్గొన్నారు.

నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- పొందూరు

అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి పి.అశోక్ అన్నారు. మండలంలోని కళ్యాణిపేట సమీపంలో గల నయారా పెట్రోల్ బంక్ వద్ద బుధవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. పెట్రోల్ బంకుల వద్ద సంభవించే అగ్ని ప్రమాదాల సమయంలోనూ, ఇంట్లో గ్యాస్ సిలిండర్ల వాడకం సమయంలోనే సంభవించే అగ్ని ప్రమాదాలను నివారించడం, ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బంక్ సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎ.రామకృష్ణ, బి.ధర్మారావు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ వద్ద అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి అశోక్

క్రైమ్ కార్నర్

సంతోష్ మృతదేహం (ఇన్‌సెట్‌లో సంతోష్ (ఫైల్)

గల్లంతైన మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీసుస్టేషన్ పరిధిలోని మెంటాడ పంచాయతీ దోనిపేట వద్ద సముద్రంలో ఓ వ్యక్తి మంగళవారం గల్లంతయ్యాడు. మృతదేహం బుధవారం ఉదయం దోనిపేట సముద్రం ఒడ్డున లభ్యమైంది. సరదాగా స్నానానికి వెళ్లి ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చాడు. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు రణస్థలం మండలం నారువ గ్రామానికి చెందిన నిద్రబంగి సంతోష్ (31), ఆళ్ల సూర్యనారాయణ, నీలాపు రమణ కలిసి కందివలస గెడ్డలో స్నానానికి వెళ్లారు. అక్కడ నీరు బాగోలేదని సమీపంలోని దోనిపేటలో సముద్ర స్నానానికి దిగారు. కెరటాల ఉధృతికి తొలుత నీలాపు రమణ మునిగిపోతుండగా గమనించిన సూర్యనారాయణ, సంతోష్‌లు కాపాడేందుకు వెళ్లారు. ఈ క్రమంలో సూర్యనారాయణ, రమణ ఒడ్డుకు చేరుకున్నా సంతోష్ మాత్రం మునిగి పోయాడు. చాలాసేపు వెతికినా సంతోష్ జాడ కానరాకపోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. జె.ఆర్.పురం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి గాలించినా సంతోష్ ఆచూకీ దొరకలేదు. సంతోష్‌కి భార్య భవాని, ఇద్దరు కుమారులు సిద్ధార్థ, హర్షవర్ధన్ ఉన్నారు. గల్లంతైన సంతోష్ మృతదేహం బుధవారం ఉదయం దోనిపేట సముద్రం ఒడ్డున లభ్యం కావడంతో జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి, పోస్ట్ మార్టం నిమిత్తం సంతోష్ మృతదేహాన్ని శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం

ఎచ్చెర్ల: మండల పరిధిలో లింగాలపేటకు చెందిన షేక్ హలీం అనే 19 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు తన తండ్రి షేక్ ఉమర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పదో తరగతి వరకు చదివి ఆమె టైలరింగ్ నేర్చుకుంటానని చెప్పి ఈనెల 19న ఉదయం పదిన్నర గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న గణేష్‌నాయక్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 9.200 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిందితుడిని బుధవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం కందమల్ జిల్లా తిలోరికి చెందిన అజిత్ ప్రధాన్, సుబాష్ అనువర్ణ వద్ద గంజాయిని కేజీ రూ.200 కొనుగోలు చేసి దానిని కర్నాటక రాష్ట్రం మైసూర్ నగరం తీసుకువెళ్లి అక్కడ బబ్లూ కుమార్ అనే వ్యక్తికి రూ.వెయ్యికి విక్రయిస్తున్నాడని తెలిపారు. కుటుంబ పోషణకు డబ్బులు చాలక, గంజాయి రవాణా చేద్దామని నిర్ణయించుకున్నారని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

నందిగాం: ఈ నెల 20న నరసన్నపేట వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి పై సంభవించిన రోడ్డు ప్రమాదంలో పెంటవూరుకు చెందిన పిన్నింటి దొరబాబు మృతి చెందిన విషయం విదితమే. పోస్టుమార్టం అనంతరం బుధవారం స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. మృతదేహం రాగానే, కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం శ్మశాన వాటికలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు అస్సాం రైఫుల్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సెలవులపై ఇంటికి వచ్చి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు.

పశువులు పట్టివేత

ఎచ్చెర్ల: మండల పరిధిలో నవభారత్ కూడలి జాతీయ రహదారి వద్ద బుధవారం ఉదయం రెండు పశువుల వ్యాన్లను ఎచ్చెర్ల పోలీసులు పట్టుకున్నారు. నారాయణపురం సంత నుంచి అలమండ మీదుగా విజయనగరం తీసుకెళ్తున్న 19 పశువులను పట్టుకొని రెండు వ్యాన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ పశువులను విజయనగరం జిల్లా కొత్తవలస గోశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

జిల్లా పరిషత్ పాఠశాల ప్రారంభం

హిరమండలం: మండలంలోని సుబలయ్ ఆర్‌అండ్‌ఆర్ కోరాడ కాలనీ మండల పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థాయిని పెంచారు. దీనిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. ఆయన చొరవతో సూదుర దూరంలో ఉన్న విద్యార్థులందరూ ఒకే దగ్గర పదో తరగతి వరకు విద్యానభ్యశించే విధానాన్ని అమలు చేశామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకొని బాగా చదువుకొని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిఇఒ తిరుమల చైతన్య, ఎంఇఒ రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మాన జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు జన్మదిన వేడుకలు బుధవారం గోపాల్‌పూర్ హోటల్లో వైసిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు ముందుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అనంతరం కేకులు కట్ చేశారు. కార్యక్రమంలో ధర్మాన కష్ణదాస్, మండవల్లి రవి, ఎం.స్వరూప్, అంబటి శ్రీనివాసరావు, తంగుడు జోగారావు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బలగ హడ్కో కాలనీలో గల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా పిల్లలకు మెడిటేషన్, నీతి కథలు చెప్పారు. అనంతరం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సహాయకులు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు: వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో చదరంగం ఆట ఆడించారు. ఆరవెల్లి అభిరాం సిద్ధార్థ, నక్కిన హర్షవర్ధన్‌లు చదరంగం ఆటలో బహుమతులు గెలుచుకున్నారు. ప్రతి విద్యార్థి చదరంగం క్రీడ నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకుడు వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న జెడ్‌పిటిసి వాణి

జెడ్‌పిటిసి పరామర్శ

టెక్కలి : మండలంలోని అక్కవరం సర్పంచ్ ప్రతినిధి పొట్నూరు అప్పలనాయుడు తల్లి సావిత్రమ్మ మృతి మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్‌పిటిసి దువ్వాడ వాణి శ్యామసుందరాపురంలోని ఉన్న అప్పలనాయుడును బుధవారం పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఎంపిటిసి మాజీ సభ్యులు పొట్నూరు రామూర్తినాయుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈమెతో పాటు బొప్పాయిపురం సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి ఉన్నారు.

ట్రోఫీలతో రోహిత్

బాడీ బిల్డింగ్‌లో రోహిత్ ప్రతిభ

కవిటి: కవిటికి చెందిన మండల రోహిత్ దేహదారుఢ్య పోటీల్లో సత్తా చాటాడు. ఐబిబి ఫెడరేషన్ ఆధ్వర్యాన శ్రీకాకుళంలో నిర్వహించిన జోనల్ బాడీ బిల్డింగ్ పోటీల్లో జూనియర్ విభాగంలో మొదటి స్థానం, 75 కేజీల విభాగంలో రెండో స్థానం సాధించాడు. ఈ సందర్భంగా జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు, ఇచ్ఛాపురం బాడీ బిల్డింగ్ సభ్యులు, కవిటి జిమ్ సెంటర్ కోచ్ దుదిష్టి మజ్జి రోహిత్‌కు అభినందనలు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ట

సోంపేట : మండలంలోని సుంకిడిలో నూతనం అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్టించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అశోక్ పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన యాత్రికులకు అన్నదానం నిర్వహించారు.

సుకుమారన్ కళా సేవలు మరువరానవి

సుకుమారన్

కోటబొమ్మాళి: సమ సమాజ నిర్మాణానికి, స్నేహభావంతో ఇస్కఫ్ (భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం) జాతీయ కార్యదర్శి టి.ఎస్. సుకుమారన్ చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు మరువ రానివని సీనియర్ పాత్రికేయుడు, డబ్బింగ్ ఆర్టిస్టు కె.భాస్కరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ఇస్కఫ్ పేరు వినగానే సుకుమారన్ గుర్తుకొస్తారని, సుకుమారన్‌ని చూడగానే ఇష్కఫ్ కార్యకలాపాలు కళ్ల ముందు కదలాడుతాయని అభివర్ణించారు. ఇష్కఫ్ సంఘంతో ఇంతటి గొప్ప అనుబంధం ఉన్న నాయకుడు, స్నేహ శీలి, మృధు స్వభావి, సుకుమారన్ నేడు భువిని వీడి దివికేగి పోవడం బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు అన్నదానం

ఆమదాలవలస: పట్టణంలోని మోణింగి వారి వీధిలో నున్న అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈ నెల 22న హనుమాన్ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద కార్యక్రమం జరపనున్నట్లు తెలిపారు.